
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

3
సిద్దిపేట
సోమవారం 27 జనవరి 2025


జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి



గణతంత్ర వేడుకల్లో ప్రసంగిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి


పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన స్టాల్‌లో అదనపు కలెక్టర్లతో కలిసి తుపాకీని పరిశీలిస్తున్న నిర్మలాజగ్గారెడ్డి


అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురిలకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్‌తో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పాల్గొన్నారు. కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎస్పీ రూపేష్‌తో కలిసి ఉత్తమ ఉద్యోగులు, క్రీడాకారులు, విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్న చిన్నారులను అభినందించారు. ఆమె వెంట సీడీసీ చైర్మన్ రాంరెడ్డి ఉన్నారు.

జిల్లాను అభివృద్ధి పథంలో
నిలుపుదాం

పారదర్శక, ప్రజాపాలనే ప్రభుత్వ ధ్యేయం
సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దక్కడానికే సంక్షేమ పథకాలు
కలెక్టర్ ఎం.మనుచౌదరి
ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 'గణతంత్ర' వేడుకలు

సిద్దిపేట టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : అందరి సహకారం, ప్రజల భాగస్వామ్యంతో సిద్దిపేట జిల్లాను అభివృద్ధి పథంలో నిలుపుదామని కలెక్టర్ ఎం.మనుచౌదరి తెలిపారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ మనుచౌదరి జాతీయజెండాను ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసంగిస్తూ పారదర్శక, ప్రజా పాలనను అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దక్కాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమాల అమలును పకడ్బందీగా చేపట్టినట్లు తెలిపారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లాలో జరిగిన పలు అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై సుదీర్ఘ సందేశాన్ని వినిపించారు.

మహిళలకు వరం మహాలక్ష్మి పథకం

జిల్లాలోని అర్హులైన మహిళలందరికీ మహాలక్ష్మి పథకం వరంగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ఆధార్‌కార్డు సహాయంతో ఉచిత రవాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. నానాటికి పెరుగుతున్న ధరల ప్రభావం పేద ప్రజలపై పడవద్దన్న సంకల్పంతో మహాలక్ష్మి పథకం కింద రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను అందజేస్తున్నట్లు వివరించారు. దాంతో పాటు నిరుపేదలైన ప్రజలకు గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులందరికీ ప్రభుత్వం ఉచితంగా విద్యుత్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.41 కోట్లను ప్రభుత్వం సబ్సిడీ చెల్లించి 1,96,860 కుటుంబాలకు లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. బడుగు బలహీన వర్గాల ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయాలనే బ్యాంకు రుణాల ద్వారా మహిళా శక్తి పథకం ప్రవేశపెట్టినట్లు వివరించారు.

పకడ్బందీగా రాజీవ్ ఆరోగ్యశ్రీ

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని పకడ్బందీగా అమలుచేసేందకు వైద్యపరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు పెంచి అమలుచేసినట్లు తెలిపారు. ఈ పథకంతో జిల్లాలో 25,468 మంది పేదలకు కార్పొరేట్ తరహా వైద్యం అందిందని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం 2024-2025 గ్రామ పంచాయతీలకు రూ. 84.18 కోట్ల నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. తడిచెత్త, పొడిచెత్త సేకరణతో సేంద్రియ ఎరువు తయారీ ద్వారా రూ.7,19,424 ఆదాయం గ్రామ పంచాయతీలకు సమకూర్చినట్లు వివరించారు. జిల్లా పరిధిలో రూ.611 కోట్లతో 148 కిలోమీటర్లతో 13 రోడ్డు పనులు, రూ.6కోట్లతో వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. పంచాయతీ ఇంజనీరింగ్ శాఖ ద్వారా రూ.532.32 కోట్లతో 2,275 పనులు మంజూరు కాగా, 1,151 పనులు పూర్తి కాగా మిగతావి పురోగతిలో ఉన్నాయన్నారు. జిల్లాలో 20 భారీ పరిశ్రమల ద్వారా రూ.665 కోట్ల పెట్టుబడితో 2,894 ఉపాధి కల్పించినట్లు చెప్పారు.



గలగల పారుతున్న గోదావరి జలాలు

జిల్లాలోని రంగనాయకసాగర్, కొమురవెల్లి మల్లన్న సాగర్, కొండపోచమ్మసాగర్, అనంతగిరి ప్రాజెక్ట్, తోటపల్లి ఇతర ప్రాజెక్టుల ద్వారా 1,37,230 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే నూతనంగా గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా లక్షా 6 వేల ఆయకట్టుతో, ఇతర ప్రాజెక్టుల కింద 4 లక్షల 54 వేల ఎకరాలకు ఆయకట్టు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. జిల్లాలో ఉన్న అపారమైన పశుసంపద ద్వారా పాలు, మాంసం, గుడ్లు ఉత్పత్తికి పశువైద్య, పశుసంవర్ధక శాఖ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

రైతులకు రూ.921.18 కోట్ల రుణమాఫీ

రుణమాఫీకి అర్హులైన 1,10,934 మంది రైతులకు రూ. 921.18 కోట్లును వారి ఖాతాలో జమచేశామన్నారు. రైతు బీమా కింద రూ.5లక్షల చొప్పున ఏడాదిలో 419 మంది రైతుల కుటుంబసభ్యులకు రూ.20.95 కోట్లను జమచేసినట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో 1,10,471 ఎకరాల్లో పత్తి పంట, 7,023 ఎకరాల్లో కందిపంట కొనుగోలు చేసినట్లు చెప్పారు. జీజీహెచ్, జిల్లా, ఏరియా ప్రభుత్వాస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలను అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు నెలకు రూ.15 లక్షల విద్యుత్ భారాన్ని భరిస్తూ ఉచితంగా అందిస్తున్నామన్నారు. విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచామని చెప్పారు. అన్నీ వర్గాల విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ అందిస్తున్నట్లు తెలిపారు.



గౌరవవందనం స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి, స్వాతంత్ర్య సమరయోధులను సత్కరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ తదితరులు

సాదాసీదాగా గణతంత్ర దినోత్సవం

సిద్దిపేట కల్చరల్/సిద్దిపేట టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 76వ గణతంత్ర వేడుకలను సాదాసీదాగా నిర్వహించారు. నాలుగు పోలీస్ బెటాలియన్లు, ఎన్‌సీసీ కేడెట్ల కవాతు, అనంతరం 8 మంది స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించి కార్యక్రమానికి ముగింపు పలికారు. కారణమేంటో తెలీదు కానీ ప్రతీసారీ వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే శకటాల ప్రదర్శన, స్టాళ్ల ఏర్పాటు కనిపించలేదు. జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో అలరించే పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయలేదు. సందడి లేకుండానే ముగియడంతో వేడుకలను నిర్వహించే ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదనం బోసిపోయింది. అలాగే ఉత్తమ ఉద్యోగులుకు ప్రశాంసా పత్రాలను కూడా అందించకపోవడంతో ప్రభుత్వ సిబ్బందే ఉన్నతాధికారుల తీరుపై గుసగుసలాడుకున్నారు.

కలెక్టరేట్‌లో జాతీయ జెండా ఎగురవేసిన అదనపు కలెక్టర్

సిద్దిపేట కలెక్టరేట్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

జిల్లా కోర్టులో వేడుకలు

సిద్దిపేట క్రైం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ఆవరణలో ప్రధాన న్యాయాధికారి సాయి రమాదేవి త్రివర్ణ పథకాన్ని ఎగరవేశారు. అనంతరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ స్వాతిరెడ్డి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మిల్లింద్ కాంబ్లె, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి చందన, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కమిషనరేట్‌లో

సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ త్రివర్ణ పథకాన్ని ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో సీపీ కార్యాలయ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేస్తున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

అదనపు కలెక్టర్ల చేతికి మున్సిపాలిటీల పాలన

ఉమ్మడి మెదక్ జిల్లాలోని 15 పట్టణాలకు ప్రత్యేకాధికారుల నియామకం
జేడీఎంఏకు తెల్లాపూర్, అమీన్‌పూర్, ఐడీఏ బొల్లారం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 26: మున్సిపాలిటీ పాలకవర్గాల గడువు పూర్తి కావడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. మళ్లీ ఎన్నికలు జరిగి నూతన పాలకవర్గాలు ప్రమాణస్వీకారం చేసేవరకు వీరు కొనసాగుతారు. మున్సిపాలిటీల నిర్వహణ, పర్యవేక్షణలో ప్రత్యేకాధికారులే కీలకం కాబోతున్నారు. కాగా స్థానిక సంస్థలను పర్యవేక్షిస్తున్న అడిషనల్ కలెక్టర్లకే ఇంచార్జులుగా అవకాశం కల్పించారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న సంగారెడ్డి జిల్లాలోని మున్సిపాలిటీల బాధ్యతలను మాత్రం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్‌కు అప్పగించారు.

ప్రత్యేకాధికారులు వీరే..

సిద్దిపేట జిల్లా: దుబ్బాక, గజ్వేల్- ప్రజ్ఞాపూర్, హుస్నాబాద్, చేర్యాల మున్సిపాలిటీలు - గరీమా అగర్వాల్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు). ప్రస్తుతం ఆమె సెలవులో ఉన్నందున అదనపు కలెక్టర్(రెవెన్యూ) అబ్దుల్ హమీద్ పర్యవేక్షించనున్నారు.
మెదక్ జిల్లా: మెదక్, నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్ మున్సిపాలిటీలు - మెంచు నగేష్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)
సంగారెడ్డి జిల్లా: అమీన్‌పూర్, తెల్లాపూర్, ఐడీఏ బొల్లారం మున్సిపాలిటీలు - ఫాల్గున్ కుమార్, జాయింట్ డైరెక్టర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్. సంగారెడ్డి, సదాశివపేట, నారాయణఖేడ్, అందోల్-జోగిపేట మున్సిపాలిటీలు- చంద్రశేఖర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)



రాజగోపుర ఆవరణలో భక్తుల రద్దీ, స్వర్ణకిరీటధారియై మల్లన్న స్వామి (ఇన్‌సెట్‌లో)

మల్లన్నకు లష్కర్ బోనం



మార్మోగిన కొమురవెల్లి క్షేత్రం
ఎల్లమ్మ తల్లికి ఘనమైన బోనాలు
దండిగా మొక్కుల సమర్పణ

చేర్యాల, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న క్షేత్రం లష్కర్ భక్తులతో పోటెత్తింది. బ్రహ్మోత్సవ మహాజాతరలో భాగంగా సంక్రాంతి తరువాత వచ్చిన రెండో వారమైన ఆదివారం రోజున సికింద్రాబాద్‌కు చెందిన భక్తులు స్వామి వారి దర్శనార్థం తరలివచ్చారు. ఇలవేల్పు దైవాన్ని దర్శించుకుని పులకించిపోయారు. ముందుగా తలనీలాలు సమర్పించుకుని కోనేటిలో పుణ్యస్నానమాచరించారు. కూరగాయలను కొనుగోలు చేసి నూతన మట్టికుండల్లో బోనం చేసి మల్లన్నకు నివేదించారు. పట్నాలు సమర్పించి, తమ కోరికలు నెరవేర్చమని ఆలయ ప్రాంగణంలోని గంగిరేగుచెట్టుకు ముడుపులు కట్టారు. ఒడిబియ్యాలు పోసి తమను సల్లంగా కాపాడమని వేడుకున్నారు. ఎల్లమ్మ దేవతకు బోనం చేసి డప్పుచప్పుళ్ల హోరుతో గుట్టపైకి ఎక్కి సమర్పించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. పట్నాలు వేసిన భక్తులతో గంగిరేగుచెట్టు ప్రాంగణం కిటకిటలాడింది. హైదరాబాద్‌కు చెందిన భక్తుడు జైపాల్ యాదవ్ రూ.1.50లక్ష విలువైన 11రకాల అరుదైన ప్రత్యేక మాలలు తెప్పించి స్వామివారికి అలంకరింపచేశారు. అలాగే గర్భాలయంలో శివలింగం, మహామండప ద్వారానికి, ఎల్లమ్మతల్లికి పూలమాలలు అలంకరించారు.

మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం

జాతరలో శని, ఆదివారాల్లో భక్తుల దాహార్తి తీర్చడంతో పాటు బోనాల తయారీ కోసం మిషన్ భగీరథ నీరు అందించాలని కలెక్టర్ మనుచౌదరి సూచించినప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆలయ సమీపంలోని నల్లాలకు నీటిసరఫరా చేయకపోవడంతో నిరుపయోగంగా మారాయి. గంగిరేగుచెట్టు పక్క నుంచే ఏర్పాటు చేసిన వీవీఐపీ క్యూలైన్‌లో భారీగా రద్దీ ఉండడంతో నజరు పట్నం వేసేందుకు భక్తులకు ఆటంకం కలిగింది.

అర్హులకే సంక్షేమ పథకాలు

- గ్రామపంచాయతీ కార్యాలయంలో జాబితా ప్రదర్శన
- లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ : కలెక్టర్ మనుచౌదరి
- కోహెడ మండలం పోరెడ్డిపల్లిలో పథకాల ప్రారంభం

కోహెడ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : అర్హులకు సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని, లబ్ధిదారుల జాబితాను గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రదర్శించడం జరుగుతుందని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల పంపిణీ పథకాన్ని ఆదివారం కోహెడ మండలం పోరెడ్డిపల్లి గ్రామంలో కలెక్టర్ మనుచౌదరి ప్రారంభించారు. తొలుత కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని ప్రదర్శించారు. పోరెడ్డిపల్లి గ్రామంలో 125 మందికి ఇందిరమ్మ ఇళ్లు, 31 మందికి కొత్త రేషన్‌కార్డులు, రేషన్‌కార్డుల్లో 29 మంది సభ్యుల చేర్పు, 419 మందికి రైతుభరోసా, 18మందికి ఆత్మీయ రైతు భరోసా పథకాల మంజూరు ఉత్తర్వులు లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తున్నామని తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, గృహ నిర్మాణ శాఖ పీడీ దామోదర్‌రావు, కోహెడ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బోయిని నిర్మలజయరాజ్, ఎంపీడీవో కిష్టయ్య, తహసీల్దార్ సురేఖ, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మంద ధర్మయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిరసనల మధ్య ప్రొసిడింగ్‌ల పంపిణీ

సిద్దిపేట రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్ గ్రామంలో జడ్పీ సీఈవో రమేష్ ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేస్తుండగా జాబితాలో అనర్హులు ఉన్నారని పలువురు నాయకులు అడ్డుకున్నారు. జాబితాలోని అందరి పేర్లు చెప్పాలని డిమాండ్ చేయగా, అధికారలు అర్హుల జాబితాలో పేర్లు చదువడంతో శాంతించారు.


లబ్ధిదారులకు పథకాల ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ మనుచౌదరి

అనువైన స్థలంలోకి కూరగాయల మార్కెట్

మెదక్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట పట్టణంలో కూరగాయల మార్కెట్‌కు అడ్డంకులు తొలిగాయి. దశాబ్దాలుగా దుమ్ము రోడ్లపైనే అమ్మకాలు సాగాయి. ఈ నేపథ్యంలో చర్చి ఆవరణలోకి మార్చగా.. ఎన్నో ఆటంకాలు ఏర్పడ్డాయి. మార్కెట్ స్థలం కోసం ఆందోళనకు సిద్ధమవుతున్న తరుణాన.. అనువైన స్థలం దొరకడంతో ఆదివారం అక్కడికి మార్చారు. ఇదే అదునుగా రామాయంపేటకు వచ్చిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌ను ఆహ్వానించి రిబ్బన కట్ చేయించారు. దీంతో విక్రయదారుల సమస్య పూర్తిగా తొలిగినట్లైంది. ఇదిలా ఉంటే ఈ స్థలం బీఆర్ఎస్ హయాంలో మున్సిపల్ భవన నిర్మాణానికి కేటాయించారు. ఇందుకు సంబంధించి పనులు సాగనందున.. ఖాళీగా ఉన్న స్థలాన్ని ఆక్రమించి వ్యాపారులు డేరాలు వేసుకున్నారు. మున్సిపల్ అధికారులు మార్కెట్‌కు స్థలం కేటాయించడంలో పూర్తిగా వైఫల్యం చెందింది. దీంతో తప్పని స్థితిలో విక్రయదారులే ఈ స్థలాన్ని ఎంపిక చేసుకోవడం గమనార్హం. అంతేకాదు అత్యంత విలువైన స్థలంలోకి మార్చినా అధికారులు అడ్డు చెప్పలేకపోయారు.



మెదక్ రహదారి అనుకొని ఏర్పాటైన కూరగాయల మార్కెట్

విరబూసిన బ్రహ్మ కమలాలు



ఖేడ్‌లోని పండరినాయక్, పల్లవి గృహంలో విరగబూసిన బ్రహ్మకమలం

నారాయణఖేడ్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ పట్టణంలోని సాయిబాబా కాలనీకి చెందిన పండరినాయక్, పల్లవి గృహంలో ఆదివారం తెల్లవారు జామున బ్రహ్మ కమలాలు విరగబూశాయి. మొదటిసారిగా బ్రహ్మకమలాలు విరగబూయడంతో వారు పూజలు చేశారు. ఈ పువ్వులను చూడటానికి కాలనీవాసులు పెద్దఎత్తున తరలివస్తున్నారు.



దర్శనం కోసం బారులు తీరిన భక్తులు





కిక్కిరిసిన గంగిరేగుచెట్టు ప్రాంగణం, పట్నంవేసి మొక్కు తీర్చుకుంటున్న భక్తులు



బోనాలు తీసుకువెళుతున్న భక్తులు

దండాలు మల్లన్న

కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో వారమైన ఆదివారం ఆలయానికి భక్తులు పోటెత్తారు. లష్కర్‌వారం కావడంతో సికింద్రాబాద్‌కు చెందిన భక్తులు స్వామివారి దర్శనార్థం భారీగా తరలివచ్చారు. ఇలవేల్పయినా మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల సిగాలతో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

క్రైం కార్నర్

చెరువులో శవమై తేలిన గురుకుల విద్యార్థి



మహేందర్‌రెడ్డి (ఫైల్)

సదాశివపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణ పరిధిలోని కొత్త చెరువులో ఆదివారం గురుకుల విద్యార్థి మృతదేహం లభ్యమైంది. సీఐ మహేష్‌కుమార్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం కొండాపూర్ మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన గంగారపు రామకృష్ణారెడ్డి, ప్రవీణ దంపతుల కుమారుడు మహేందర్‌రెడ్డి(18) మునిపల్లి మండలం లింగపల్లి గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు ఇంటికొచ్చిన అతను ఈనెల 20న ఇంటి నుంచి పాఠశాలకు బయలుదేరి.. తిరిగి అదేరోజు సదాశివపేటకు వచ్చాడు. మూడురోజులుగా కళాశాలకు రాకపోవడంతో ఈ నెల 23న కళాశాల సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు బంధువుల, మిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మహేందర్‌రెడ్డి కోసం గాలింపు చేపట్టారు. తాజాగా సదాశివపేట సమీపంలోని కొత్త చెరువులో మహేందర్‌రెడ్డి ఆదివారం సాయంత్రం శవమై కనిపించాడు. విద్యార్థి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు. మహేందర్‌రెడ్డి మృతితో అనంతసాగర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పురుగుల మందు తాగిన వ్యక్తి..

చికిత్స పొందుతూ మృతి



కనకరాజు (ఫైల్)

కుకునూరుపల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన కోనాయపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని వడ్డెర కాలనీకి చెందిన దున్నపోతుల కనకరాజు(28)కు నాలుగేళ్ల క్రితం వెల్దండ గ్రామానికి చెందిన మమతతో వివాహమైంది. దంపతులిద్దరు హైదరాబాద్‌లో కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కనకరాజు తల్లి అనారోగ్యానికి గురికావడంతో పది రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చి ఇక్కడే ఉంటున్నారు. తల్లి ఆరోగ్యం దృష్ట్యా ఇక్కడే ఉందామని కనకరాజు భార్యతో చెప్పగా ఆమె ఒప్పుకోలేదు. ఈ విషయంపై భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గురువారం కూడా గొడవ పెట్టుకుని మమత హైదరాబాద్‌కి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన కనకరాజు పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



శ్రీకాంత్ (ఫైల్)

శివ్వంపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం పెద్ద గొట్టిముక్కలలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని పెద్దగొట్టిముక్కల గ్రామానికి చెందిన కొత్తోళ్ల శ్రీకాంత్(29) ఫ్లిప్‌కార్ట్‌లో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతునికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ర్యాపిడో రైడర్ మృతి

రామచంద్రాపురం టౌన్, జనవరి 26, (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ర్యాపిడో రైడర్ దుర్మరణం చెందిన ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ రవీందర్ కథనం ప్రకారం... హఫీజ్‌పేటకు చెందిన జగన్నాథ్(35) ర్యాపిడో రైడర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం రోజుమాదిరిగానే విధులకు వెళ్లాడు. గచ్చిబౌలి నుంచి విపిన్‌కుమార్ అనే కస్టమర్‌ను తెల్లాపూర్‌కు ఎక్కించుకుని వచ్చాడు. తెల్లాపూర్ హుడా వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ బైక్‌ను ఢీ కొట్టడంతో రైడర్ జగన్నాథ్ అక్కడికక్కడే మృతి చెందగా, విపిన్‌కుమార్ గాయాలతో బయటపడ్డాడు. మృతుడి భార్య సురేఖ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సురేశ్ కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు

రామచంద్రాపురం టౌన్, జనవరి 26, (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదైంది. ఎస్ఐ దేవేందర్ కథనం ప్రకారం ఉస్మాన్‌నగర్‌కు చెందిన యాదయ్య(50) రాజపుష్ప విల్లాస్‌లో నీళ్ల విడిచే పనులు నిర్వర్తిస్తున్నాడు. ఈ నెల 18న వెళ్తున్న యాదయ్యను బైక్‌పై వెళ్తున్న ముఖేష్ అనే వ్యక్తి వెనుక నుంచి బలంగా ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స ఖర్చు భరిస్తానని చెప్పిన ముఖేష్ ఎంతకీ చెల్లించకపోవడంతో యాదయ్య ఆదివారం కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

సింగూరు కాల్వల సీసీ లైనింగ్‌కు రూ.168 కోట్లు

- పది రోజుల్లో పనులు ప్రారంభిస్తాం
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- పేదలందరికీ పథకాలు అందజేస్తాం : సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి
- ఇసోజిపేట,నేరడిగుంటలో నాలుగు సంక్షేమ పథకాల ప్రారంభం



ఇసోజిపేటలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట/పుల్కల్, జనవరి26 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టు నుంచి సాగునీరందించే కాల్వలకు రూ.168 కోట్ల వ్యయంతో సిమెంట్ లైనింగ్ చేయనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. పది రోజుల్లో ఆ పనులను ప్రారంభిస్తామని చెప్పారు. ఆదివారం పుల్కల్ మండలం ఇసోజిపేట, అందోలు మండలం నేరడిగుంట గ్రామాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను కలెక్టర్ క్రాంతి వల్లూరితో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. పలువురు లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జోగిపేటలోని నర్సింగ్ కాలేజీకి అనుబంధంగా 100 పడకల ఆస్పత్రి నిర్మిస్తున్నామని చెప్పారు. 50 పడకలతో అధునాతన మాతాశిశు సంరక్షణ ఆస్పత్రిని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సుల్తాన్‌పూర్ వద్ద పోలీస్ స్టేషన్, ట్రామా కేర్ ఆస్పత్రిని త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఆయా కార్యక్రమల్లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్‌డీవో జ్యోతి, అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు, డీపీవో సాయిబాబా, హౌజింగ్ పీడీ చలపతిరావు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మక్త జగన్మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దుర్గారెడ్డి, శివరాజ్ యాదవ్, నాయకులు రాజిరెడ్డి, రామచంద్రారెడ్డి, గాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● వట్‌పల్లి : వట్‌పల్లిలో రూ.11.20 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదివారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలని, వచ్చే ఏడాదిలోగా అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు.



సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

బీజేపీ ప్రజలపై మతాన్ని రుద్దుతోంది

- ప్రజల సమస్యలు పట్టని పాలకులు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

సంగారెడ్డి రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన బీజేపీ ప్రజలపై మతాన్ని రుద్దుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సీపీఎం రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా రెండవ రోజు ఆదివారం కొండాపూర్ మండలం మల్కాపూర్ చింతల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జాతీయ జెండాతో పాటు పార్టీ జెండాను ఆవిష్కరించి అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదన్నారు. ముఖ్యంగా ప్రజాసమస్యలను పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఈ మహాసభల ద్వారా తెలంగాణలో ప్రజల మన్ననలు పొందేలా నిర్ణయాలు ఉంటాయన్నారు. ప్రజా సమస్యలపై ఉద్యమించేందుకు భవిష్యత్ కార్యాచరణ రూపొందించి తీర్మానిస్తామన్నారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మహాసభల ఆహ్వాన కమిటీ చైర్మన్ చుక్క రాములు మాట్లాడుతూ సీపీఎం రాష్ట్ర మహాసభలను సంగారెడ్డిలో నిర్వహింస్తుండడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, జాన్‌వెస్లీ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి జయరాజ్, మాణిక్యం, సాయిలు, కృష్ణ, దత్తు తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు కాంగ్రెస్‌లో అసమ్మతిని చల్లార్చుస్తాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- దాడి ఘటనపై పీసీసీ నిజనిర్ధారణ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

పటాన్‌చెరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు కాంగ్రెస్‌లో అసమ్మతిని చల్లార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ అన్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడి విషయమై నిజనిజాలు తేల్చేందుకు అధిష్టానం ఆయనతోపాటు పీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డితో కూడిన నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఆదివారం పటాన్‌చెరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులతో వారు సమావేశమై అభిప్రాయాలను సేకరించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్‌తో ప్రత్యేకంగా సమావేశమై నియోజకవర్గంలో అసమ్మతికి కారణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విప్ ఆదిశ్రీనివాస్ మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని ఏకతాటిపైకి తెచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇటీవల చోటుచేసుకున్న పరిస్థితులపై పూర్తి స్థాయిలో అభిప్రాయాలను సేకరించి పార్టీ పీసీసీ అధ్యక్షుడు, సీఎంకు నివేదిక రూపంలో అందజేస్తామన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు, టీఎస్ఐఐసీ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి, మెదక్ పార్లమెంట్ నాయకుడు నీలం మధుముదిరాజ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుధాశ్రీనివాస్‌గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

తండ్రీకొడుకులకు రిమాండ్

చిన్నశంకరంపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని కామారం తండాకు చెందిన తండ్రీకొడుకులను రిమాండ్‌కు తరలించారు. ఆదివారం ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన కథనం ప్రకారం తండాకు చెందిన హలావత్ భీమా గతంలో వ్యవసాయ భూమిని మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపల్లికి చెందిన ఆకుల శ్రీనివాస్‌కు విక్రయించాడు. దీంతో శ్రీనివాస్ అందులో పంటలను సాగు చేస్తున్నాడు. కాగా, గతేడాది ఫిబ్రవరిలో హలావత్ భీమా, తన కుమారుడు రాజ్‌కుమార్ అకారణంగా అతడి పంటను ధ్వంసం చేయగా, బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో తండ్రీకొడుకులపై క్రిమినల్ కేసు నమోదు చేసి బైండోవర్ చేసి హెచ్చరించారు. అయినా పలుమార్లు శ్రీనివాస్‌తో గొడవపడ్డారు. దీంతో సత్ప్రవర్తన ఉల్లంఘించినందుకు గాను తహసీల్దార్ ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున జరిమానా, జైలు శిక్ష విధించారు. జరిమానా కట్టనందున తహసీల్దార్ ఆదేశాల మేరకు తండ్రీకొడుకులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.





శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, స్వామివారి ఎదుర్కోలులో విద్యార్థినుల కోలాటం

ఘనంగా శివపార్వతుల కల్యాణం

కొండపాక, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దుద్దెడ గ్రామంలోని స్వయంభూ శంభు లింగేశ్వర ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలు మూడవ రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గొల్లపల్లి రఘురామశర్మ, శ్రీనివాస్‌శర్మ నేతృత్వంలో వేద బ్రాహ్మణులు శివపార్వతుల కల్యాణాన్ని క్రతువును వైభవంగా నిర్వహించారు. స్వామివారి తరఫున గ్రామానికి చెందిన నర్ర సవిత-రాఘవరెడ్డి కుమార్తె బండి కీర్తి - మాధవ రెడ్డిలు వ్యవహరించగా అమ్మవారి తరఫున సికింద్రాబాద్‌కు చెందిన నీలిమ- మహేశ్ దంపతులు కన్యాదానం చేశారు. భక్తులు అధికసంఖ్యలో హాజరైన కల్యాణాన్ని వీక్షించారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, జిల్లా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వేలేటి రోజా-రాధా కిషన్ శర్మ వేడుకలకు హాజరయ్యారు. కల్యాణం అనంతరం రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్‌కు చెందిన దాతలు ఉప్పల రాధ, పద్మ, శ్రీనివాస్, ఆలయ ట్రస్టు అధ్యక్షులు మంచాల శ్రీనివాస్, సభ్యులు తాజా మాజీ సర్పంచ్ ఆరేపల్లి మహదేవ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సాయంత్రం ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు వంటేరు ప్రతాపరెడ్డి తదితరులు ఉన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసలు



మెదక్ జిల్లాలో ప్రశంసాపత్రాలు అందుకుంటున్న ఉత్తమ ప్రభుత్వ ఉద్యోగులు

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన వివిధ శాఖల ఉద్యోగులకు 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రశంసా పత్రాలు అందజేశారు. మెదక్ జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, అదనపు కలెక్టర్ నగేష్ చేతుల మీదుగా ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే సంగారెడ్డి జిల్లాలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ వల్లూరు క్రాంతి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు.

- మెదక్ అర్బన్/సంగారెడ్డి టౌన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి)



సంగారెడ్డి జిల్లాలో ప్రశంసాపత్రాలు అందుకుంటున్న ఉత్తమ ఉద్యోగులు



చేర్యాల మున్సిఫ్‌కోర్టు ఆవరణలో జాతీయపతాకాన్ని ఎగురవేస్తున్న జడ్జి శ్రావణి యాదవ్



హుస్నాబాద్‌లో ఐవోసీలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఆర్డీఓ రామ్మూర్తి



చిన్నకోడూరులో నృత్యం చేస్తున్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలు



దుబ్బాకలోని గాంధీవిగ్రహం వద్ద జాతీయపతాకానికి వందనం చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



సిద్దిపేట పట్టణంలోని ఓ పాఠశాలలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

● జిల్లాలో ఘనంగా గణతంత్ర వేడుకలు

న్యూస్‌నెట్‌వర్క్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 76 గణతంత్ర దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ పార్టీల కార్యాలయాలు, పాఠశాలలు, పలు సంఘాల ఆధ్వర్యంలో అధికారులు, బాధ్యులు జాతీయ జెండాను ఎగురవేశారు. దీంతో వాడవాడలా మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి. పలు పాఠశాలల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు స్వాతంత్య్రసమరయోధుల వేషధారణలో చూపరులను అలరించారు. సిద్దిపేటలోని లాల్‌కమాన్‌పై సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. పలు ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో విద్యార్థులు దేశభక్తి పాటలపై నృత్యాలతో అందరినీ ఆకట్టుకున్నారు. దుబ్బాక గాంధీవిగ్రహం వద్ద దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ రమేష్‌కుమార్ జెండాను ఎగురవేశార దుబ్బాకలోని వివిధ పాఠశాలల విద్యార్థులు దేశభక్తుల వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. చేర్యాల పట్టణంలోని కోర్టులో జడ్జి శ్రావణియాదవ్ జెండాను ఎగురవేశారు. హుస్నాబాద్ మున్సిపల్ నూతన కార్యాలయ భవన ఆవరణలో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, కమిషనర్ మల్లికార్జున్ ఆవిష్కరించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేశారు. గజ్వేల్‌లోని కోర్టు వద్ద న్యాయమూర్తి ప్రియాంక, ఐవోసీలో ఆర్డీవో చంద్రకళ, ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ పురుషోత్తంరెడ్డి, మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ గొల్కొండ నరసయ్య జెండాలను ఎగురవేశారు. అదేవిధంగా జిల్లాల్లోని వివిధ మండలాల్లో మండల ప్రజాపరిషత్, తహసీల్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్‌లలో సంబంధిత అధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు.



దుబ్బాకలో..

చేతలు కాదు.. షరతుల ప్రభుత్వం ఇది

● మాజీమంత్రి హరీశ్‌రావు

గజ్వేల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ చేతల ప్రభుత్వం కాదని... షరతుల ప్రభుత్వమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ పాలకవర్గ అభినందన సభను ఆదివారం గజ్వేల్ పట్టణంలో నిర్వహించగా, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, టీఎస్ఎంఎస్ఐడీసీ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలసి ఆయన పాల్గొని, వారిని సన్మానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు రాష్ట్రంలోని కోటి మంది వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తామని ప్రకటించిందని, అధికారంలోకి వచ్చాక రేవంత్‌రెడ్డి రూ.10లక్షలు అంటే, మంత్రి సీతక్క 6లక్షల మందికి ఇస్తామని ప్రకటించారని, కానీ నాలుగు లక్షల మందికే ఇస్తున్నారని దుయ్యబట్టారు. ఆగస్టు 15న రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని దేవుళ్లపై ఒట్టేసి మాట తప్పారని, ప్రస్తుతం నాలుగు పథకాలను అందిస్తామని గణతంత్ర దినోత్సవం సాక్షిగా ప్రకటించి మాట తప్పారని మండిపడ్డారు. మండలానికి ఒక్క గ్రామాన్ని ఎంపిక చేసి పథకాలను అందిస్తున్నారని విమర్శించారు. అనంతరం మునిసిపల్ పాలకవర్గ సభ్యులను ఆయన సన్మానించారు.



ఉత్తమ ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సన్మాన కార్యక్రమంలో హరీశ్‌రావు

ఐదేళ్లలో పాలకవర్గ సభ్యులు ఎంతగానో అభివృద్ధి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రోజాశర్మ, శ్రీనివాస్, మధు, నవాజ్‌మీరా, అహ్మద్ తదితరులున్నారు.

ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నారు

సిద్దిపేట కల్చరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులను ఇబ్బంది పెడుతుందని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. పబ్లిక్ సర్వెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు చెందిన వివిధ శాఖల్లోని జీవిత సభ్యుల పదవి విరమణ, ఉత్తమ ఉద్యోగుల సన్మానం కార్యక్రమంలో మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ 13 నెలల పాలనలో 9వేల మంది ఉద్యోగులు పదవి విరమణ పొందితే ఒక్కరికి కూడా రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేదని ఆరోపించారు. ఉద్యోగులకు వచ్చే పీఆర్‌సీ, డీఏ గురించి ప్రభుత్వం ఆలోచించటం లేదన్నారు. ప్రస్తుతం ఉన్న ఉద్యోగుల పదవి విరమణ వయసును 61 నుంచి 65 పెంచుతామని ప్రభుత్వం ఆలోచిస్తుందని, ఈ విధానాన్ని ఉద్యోగులు, నిరుద్యోగులు ఎవరు కూడా సమ్మతించరని స్పష్టం చేశారు.

సిద్దిపేట అంటే ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తుందన్నారు. సిద్దిపేటకు చెందిన ఉద్యోగుల జీతాలు ఇవ్వడంలో కూడా ప్రభుత్వం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుందన్నారు. సిద్దిపేటలో కొత్త అభివృద్ధి పనులు ఇవ్వకపోగా పాతవి కూడా పక్క జిల్లాలకు తీసుకెళ్తున్నారని మండిపడ్డారు. ఇకపై చూస్తూ ఊరుకోబోమని, రాబోయే బడ్జెట్ సమావేశాల్లో అన్ని సమస్యలపై పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు.

మందకృష్ణకు పద్మశ్రీ పురస్కారంపై హర్షం



గజ్వేల్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద నాయకుల సంబురాలు

గజ్వేల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మందకృష్ణకు పద్మశ్రీ ప్రకటించడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్ నాయకుల సంబురాలు జరుపుకున్నారు. గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ నాయకులు శనిగారి రమేశ్, ఉబ్బని ఆంజనేయులు ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు మైస రాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ, ఎంఈఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చేబర్తి యాదగిరి, బెల్లి శ్యామల హాజరయ్యారు.

● హుస్నాబాద్: దండోరా ఉద్యమ నాయకుడు మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు ప్రకటించడం పట్ల ఆదివారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గాదెపాక రవీందర్, లింగాల సాయన్న, ముక్కెర సంపత్‌కుమార్ ఉన్నారు.

'సురభి'లో వెయ్యి ఉచిత డెలివరీలు పూర్తి

సిద్దిపేట అర్బన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మిట్టపల్లి సమీపంలోని సురభి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో సేవాదృక్పథంతో 1000 డెలివరీలను ఉచితంగా పూర్తిచేసినట్టు ఆసుపత్రి చైర్మన్ హరిందర్‌రావు పేర్కొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆసుపత్రిలో ఆదివారం కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా హరిందర్‌రావు మాట్లాడుతూ.. మహిళలు గైనిక్ సమస్యల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య విషయాల పట్ల డాక్టర్ సలహా సూచనల మేరకు నడుచుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో ఉచిత డెలివరీ సౌకర్యాన్ని అందిస్తున్నామని నిరుపేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీడియాట్రిషన్ హెచ్ వోడీ శివ రామాచారి, గైనకాలజిస్ట్ సుమలత, పీఆర్‌వో పరశురాములు, డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి జ్ఞాపకార్థం విద్యార్థులకు బహుమతులు

మద్దూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబర్తి గ్రామంలో 2019-20 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థి దేశెట్టి అజయ్ అకాల మరణం చెందారు. మిత్రుడి జ్ఞాపకార్థం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్టీల్ టిఫిన్ బాక్స్‌లు, స్వీట్లు, బిస్కెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వరదరాజు, ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్రభానుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మర్కుక్‌లో క్రికెట్ టోర్నమెంట్

గజ్వేల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల ఉపాధ్యక్షుడు తాడూరు మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో మూడు టీమ్‌లు పాల్గొనగా విజేతగా గెలుపొందిన చెక్కల వెంకటస్వామి టీంకు రూ. 5వేల నగదు బహుమతిని మహేష్‌గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో స్వామిగౌడ్, సురేష్, స్వామి, మహేష్, మధు, రవి, ప్రవీణ్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలో విజేతలకు బహుమతుల ప్రదానం

సిద్దిపేట అర్బన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన బాలరాజు కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఆదివారం బి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నీలో గెలుపొందిన టీం సభ్యులకు ఎన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన కృష్ణమూర్తి బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా రూ.8 వేలు, రెండో బహుమతిగా రూ.5 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, తరిగొప్పుల స్వామి,శేరి ఆంజనేయులు, కొలిమి భిక్షపతి, బాబు, సంతోష్‌రెడ్డి, రమేష్ సత్తయ్య, ఎల్లం మరికొంత మంది గ్రామస్థులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు బహుమతిని అందజేస్తున్న దృశ్యం

కాంగ్రెస్‌పార్టీవి డొల్ల హామీలు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్

చిన్నకోడూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయడంలేదని కాంగ్రెస్ హామీలన్ని డొల్ల హామీలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్ విమర్శించారు. చిన్నకోడూరులో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 26న ఆరు గ్యారంటీల్లో నాల్గింటిని అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామంలో కూడా పూర్తిస్థాయిలో నాలుగు పథకాలను అమలు చేయలేకపోయిందని ఆరోపించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన అందరికి అన్ని పథకాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, మాజీ ప్రజాప్రతినిధులు పాపయ్య, ఉమేష్ చంద్ర, శ్రీనివాస్, నాయకులు జంగిటి శ్రీనివాస్, వెంకటేశం, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు



రాయపోల్: రామారంలో సంక్షేమ పథకాల ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తున్న అదనపు కలెక్టర్



కొమురవెల్లి మండలం పోసాన్‌పల్లిలో ప్రొసీడింగ్ పత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యురాలు



మద్దూరు: ధర్మారంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల మంజూరు పత్రాలను అందజేస్తున్న దృశ్యం

● జిల్లాలో ప్రజాపాలన పథకాల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ

న్యూస్‌నెట్‌వర్క్, జనవరి 26(ఆంధ్రజ్యోతి):

ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వం ప్రారంభించిన నాలుగు పథకాలకు సంబంధించిన ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం జిల్లావ్యాప్తంగా ప్రారంభించారు. అయితే మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకొని ఆయా గ్రామాల్లో అధికారులు ప్రొసీడింగ్ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కాగా పలు గ్రామాల్లో తమపేర్లు జాబితాలో రాలేదని ఆయా గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అర్హులైనవారు మళ్లీ దరఖాస్తు చేసుకుంటే తిరిగి మంజూరు చేస్తామని అధికారులు వారికి సూచించారు. గజ్వేల్ మండల పరిధిలోని గిరిపల్లి, రాయపోల్ మండలం రామారం, ములుగు మండల పరిధిలోని లక్ష్మక్కపల్లి గ్రామాల్లో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. దశలవారీగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. పథకాలు రాని అర్హులైన వారు సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకున్నట్లయితే తిరిగి మంజూరు చేయిస్తామని తెలిపారు. కాగా నూతనంగా మంజూరైన రేషన్‌కార్డు లబ్ధిదారులందరికీ ఫిబ్రవరిలో బియ్యం అందుతాయని స్పష్టం చేశారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎలుపల్లి గ్రామంలో మండల స్పెషల్ ఆఫీసర్ ఏడీ వైపద్మ, తహసిల్దార్ సలీంమియా పాల్గొని గ్రామస్థులకు ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. అనంతరం నాలుగు పథకాల లబ్ధిదారుల లిస్టును ప్రకటించారు. అనంతరం అర్హులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేసి కార్యక్రమాన్ని ముగించారు. తొగుట మండలంలోని తుక్కాపూర్ గ్రామంలో దుబ్బాక డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు మల్లయ్య, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ఇతర అధికారులతో కలిసి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. చిన్నకోడూరు మండలం మెట్టుపల్లిలో డీఆర్డీవో పీడీ జయదేవ్ ఆర్య పాల్గొని ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. కొమురవెల్లి మండలంలోని పోసాన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యురాలు ఎం.భవాని పాల్గొని లబ్ధిదారులకు సంబంధిత పత్రాలను పంపిణీ చేశారు. అదేవిధంగా హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామం, కొండపాక మండలం దమ్మక్కపల్లి, మద్దూరు మండలంలోని ధర్మారం, వర్గల్ మండలంలోని అంబర్‌పేట, దూళిమిట్ట మండలంలోని కూటిగల్, జగదేవ్‌పూర్ మండలంలోని లింగారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో లబ్ధిదారులకు సంబంధిత అధికారులు ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు.

సిద్దిపేటలో మెగా శాకాహార ర్యాలీ



సిద్దిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న శాకాహారులు

సిద్దిపేట కల్చరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పిరమిడ్ స్ప్రిచ్యువల్ సొసైటీస్ మూమెంట్, పిరమిడ్ సేవాదళ్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో మహాకరుణ మెగా శాకాహార ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని సాయిబాబా మందిరం వద్దనున్న తాడూరి బాలగౌడ్ ఫంక్షన్‌హాల్ నుంచి మొదలైన ర్యాలీ ప్రభుత్వ ఆసుపత్రి, ఎన్సాన్‌పల్లి రోడ్డు, విక్టరీ చౌరస్తా, ముస్తాబాద్ చౌరస్తా, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మీదుగా దాదాపు 4 కిలోమీటర్ల మేర ర్యాలీ కొనసాగింది. హైదరాబాద్, కడ్తాల్‌తో పాటుగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 2 వేల మంది శాకాహారులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. బ్రహర్షి సుభాష్ పత్రీజీ ఆశయసాధనలో భాగంగా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతున్నట్లు నిర్వాహకులు భూపతి తెలిపారు. అహింసాయుత దేశంగా మారాలనేది తమ ఉద్దేశమన్నారు. ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని, మాంసాహారం వదిలి శాఖాహారులుగా మారాలని ప్లకార్డులు ప్రదర్శించారు. మాంసాహారం వల్ల కలిగే అనర్థాలను నినాదాలు చేస్తూ, పాటలు పాడుతూ ర్యాలీ తీశారు. పలువురు కూరగాయలతో చేసిన దండలను మెడలో వేసుకుని ర్యాలీలో పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే కష్టపడితే మంచి ఫలితాలు



విద్యార్థులకు ప్లేట్స్ పంపిణీ చేస్తున్న రాష్ట్ర రైతు సంక్షేమ సమితి సభ్యురాలు మర్కంటి భవానీరెడ్డి తదితరులు

సిద్దిపేట రూరల్,జనవరి 26(ఆంధ్రజ్యోతి); విద్యార్థి దశలో కష్టపడి చదివితే భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధిస్తారని రాష్ట్ర రైతు సంక్షేమ సమితి సభ్యురాలు మర్కంటి భవానీరెడ్డి విద్యార్థులకు సూచించారు. ఆదివారం నారాయణరావుపేట మండలం జక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చొప్పదండి చంద్రశేఖర్ సహకారంతో 250 మంది విద్యార్థులకు ప్లేట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి భవానీరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తాను రైతు బిడ్డనని, గ్రామీణ ప్రాంతంలో చదువుకుని మంచి అవకాశాల్ని అందిపుచ్చుకున్నాని విద్యార్థులకు గుర్తు చేశారు. జక్కాపూర్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో అత్యున్నత ప్రతిభ కనబరుస్తున్న తెలుసుకున్నానని చెప్పారు. విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల గురించి రాష్ట్రప్రభుత్వం మరియు విద్యా శాఖ కమిషన్ దృష్టికి తీసుకెళ్లి మరింత సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షౌకత్ అలీ, గ్రామ ప్రతినిధులు పెద్దన్న పంతులు, కోడి దేవేందర్, పల్లె కనకాంబరం, చింతల రాజ్‌వీర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగంపై విద్యార్థుల ప్రదర్శన



విద్యార్థులు నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శన

గజ్వేల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మర్కుక్ మండలంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల అంగడికిష్టాపూర్‌లో విద్యార్థులు వినూత్న ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నారు. భారత రాజ్యాంగంపై కొరియోగ్రాఫర్ చిన్ని కృష్ణ రూపొందించిన పాటపై విద్యార్థులు చేసిన నృత్యం అందరినీ కట్టిపడేసింది.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట గల స్థలంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను వారు మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న కార్యక్రమాలను, పథకాలను ప్రజలు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య, మునిసిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు ఉన్నారు.

సీనియర్ జర్నలిస్టు సత్యనారాయణకు ఘన నివాళి

గజ్వేల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ జర్నలిస్టు, టీఎస్‌పీఎస్‌సీ మాజీ సభ్యుడు ఆర్. సత్యనారాయణ మృతిపట్ల గజ్వేల్ జర్నలిస్టులు నివాళులర్పించారు. గజ్వేల్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో, అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆర్.సత్యనారాయణ చిత్రపటానికి జర్నలిస్టు వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్నెల్లి సురేందర్, మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల పక్షాన నిస్వార్థంగా పోరాడడంతో పాటు నిష్పక్షపాతంగా ప్రజా సమస్యలను వెలికితీశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ స్ఫూర్తిగా రక్తదాన శిబిరం



శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో రక్తదానం చేస్తున్న యువకులు

సిద్దిపేట కల్చరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సరస్వతి శిశుమందిర్ మాతృసంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రారంభమై వందేళ్లు పూర్తయిన సందర్భంగా గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేటలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ మాటలను స్ఫూర్తిగా తీసుకుని ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు చెప్పారు. 43 యూనిట్ల రక్తం సేకరించినట్లు ప్రధానాచార్యులు మోతుకు నరేష్ తెలిపారు.